


Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 92
సంచిక : 214
పేజీలు : 3
శనివారం, ఏప్రిల్ 18, 2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN



# ఉచిత కంటి వైద్య శిబిరం

- ప్రారంబించిన ఐజి చంద్రశేఖర్ రెడ్డి

**టీ మీడియా ఏప్రిల్ 17 అశ్వరావుపేట:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం దమ్మపేట మండల పట్టణ కేంద్రంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం వినాయక ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలు, నివారణపై అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా ఐజీ చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్‌లతో కలిసి ఆయన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐజీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో అటు సైబర్ నేరాలు, ఇటు రోడ్డు ప్రమాదాలు సమాజానికి పెద్ద సమస్యగా తయారయ్యాయని, వీటి పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. మనిషి ఇంట్లో ఉంటే సైబర్ నేరగాళ్లు, బయటకు వస్తే రోడ్డు ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరాల్లో డబ్బు పోతే మళ్ళీ సంపాదించుకోవచ్చని, కానీ రోడ్డు ప్రమాదాల్లో ప్రాణం పోతే తిరిగి పొందలేమని ఆయన స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2025 సంవత్సరంలో 248 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించడం తనను ఎంతో కలచివేసిందన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా మండలంలోని పూసుకుంట గ్రామానికి చెందిన కొండరెడ్లకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. అదేవిధంగా, శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు యువతకు డ్రైవింగ్ లైసెన్సులను అందజేశారు.

**నిబంధనల పాటించడంతోనే భద్రత:** కలెక్టర్, ఎస్పీ జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు స్వీయ నియంత్రణ పాటించాలని కోరారు. 'అరైవ్ అలైవ్' ద్వారా ప్రజల్లో చైతన్యం రావాలని ఆకాంక్షించారు. ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ రోడ్డు నిబంధనల ఉల్లంఘనపై పోలీసు శాఖ రాజీపడదని, తనిఖీలను మరింత ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం వంటి చర్యలు ప్రాణాంతకమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సతీష్, ఏఎంసీ చైర్మన్ వాసం రాణి, దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మండలంలోని నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చు

-మల్టీ జోన్1 ఐజిపి
ఎస్.చంద్రశేఖర్ రెడ్డి





**టి మీడియా, ఏప్రిల్ 17, దమ్మపేట:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా సజీవంగా చేరుకోండి కార్యక్రమంలో రోడ్డు భద్రత గురించి దమ్మపేట మండల పరిధిలో వినాయక ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మల్టీ జోన్-1 ఐజిపి ఎస్.చంద్రశేఖర్ రెడ్డి ఐపిఎస్,జిల్లా కలెక్టర్ అంకిత్,జిల్లా ఎస్పీ రోహిత్ రాజు లు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించి ఆటో డ్రైవర్లకు,లారీ డ్రైవర్లకు,ఇతర వాహనదారులకు కంటి పరీక్షలు చేయించి వారికి కళ్ళజోళ్ళు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత,హెల్మెట్ పై అవగాహన గురించి పోటీ పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించడం జరిగింది.అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి దమ్మపేట పోలీసులు,మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వారి సహకారంతో 10 మందికి డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించడం జరిగింది.గిరిజన గ్రామమైన కొండరెడ్లు నివసించే పూసుకుంట గ్రామానికి చెందిన 20 మంది యువకులకు ఐజీపి,ఎస్పీ,కలెక్టర్ హెల్మెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి ఐపిఎస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నియంత్రించడంలో బాధ్యత గల పౌరులుగా మెలగాలని సూచించారు.ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగి అక్కడ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులకు ప్రథమ చికిత్స అందేలా సహాయం చేయాలని తెలిపారు.గోల్డెన్ అవర్ లో వారికి ప్రథమ చికిత్స అందించి సహాయం చేస్తే వారి ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు.డిఫెన్సివ్ డ్రైవింగ్ సూత్రాలను పాటిస్తూ క్రమశిక్షణతో మెలిగే వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురికారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి సతీష్ కుమార్,అశ్వారావుపేట సిఐ నాగరాజు రెడ్డి,దమ్మపేట ఎస్సై కిషోర్ రెడ్డి,దమ్ము పేట పోలీస్ సిబ్బంది,దమ్మపేట మండల వివిధ గ్రామాల సర్పంచులు,పంచాయతీ సెక్రెటరీలు,అంగన్వాడీ టీచర్లు,ఆశా కార్యకర్తలు,విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీ మెంబర్స్ వివిధ పార్టీల రాజకీయ నాయకులు,ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు పెంచాలి

- కౌలు రైతుల మొక్కజొన్న వరి ధాన్యం కొనుగోలు చేయాలి
- తెలంగాణ రైతు సంఘం నేతలు నున్నా, బొంతు

3లో...

# ప్రతి విద్యార్థి చదివే నైపుణ్యం సాధించాలి

-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**టి మీడియా, ఏప్రిల్ 17, ముదిగొండ:** ప్రతి విద్యార్థి చదివే నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.ముదిగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన "ఎవ్రీ చైల్డ్ రీడ్స్ సెలబ్రేషన్స్" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం పై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ముదిగొండ మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మమేకమై వారి పఠన నైపుణ్యాలను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు స్కిట్లు ప్రదర్శించడం, కథలు చదవడం, ఆత్మ విశ్వాసంతో పఠనం చేయడం వంటి కార్యక్రమాలు చూసి తాను ఎంతో ఆనందానికి లోనయ్యానని కలెక్టర్ తెలిపారు. "ఎవ్రీ చైల్డ్ రీడ్స్" కార్యక్రమం ప్రారంభించిన ఉద్దేశ్యం నెరవేరుతోందని, సాధించిన పురోగతిపై సంతోషం వ్యక్తం చేశారు.చదవడం ఒక అత్యంత ముఖ్యమైన నైపుణ్యమని, చదవగలిగితే రాయడం, మాట్లాడడం సులభమవుతాయని అన్నారు. చదవలేని పిల్లలకు ఆత్మవిశ్వాసం తగ్గిపోతుందని, ఈ సమస్యను ప్రారంభ దశలోనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 29 వేల మంది విద్యార్థులు పఠన నైపుణ్యాలు సాధించారని తెలిపారు.ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని స్వంతంగా స్వీకరించి విజయవంతం చేయడం అభినందనీయమని, ప్రతి ఉపాధ్యాయునికి తన అభినందనలు తెలియజేశారు. ప్రారంభంలో కేవలం 12-13 శాతం మంది విద్యార్థులు మాత్రమే వాక్యాలు చదవగలిగితే, ప్రస్తుతం అది 84 శాతానికి పెరగడం ఉపాధ్యాయుల కృషి ఫలితమని తెలిపారు. మిగిలిన 16 శాతం మంది విద్యార్థులు కూడా పఠన నైపుణ్యాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు.ప్రతి రోజూ ఒక గంట సమయం కేటాయిస్తూ పఠన నైపుణ్యాల పెంపుకు ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి మరింత ఉత్సాహంతో కార్యక్రమాన్ని కొనసాగించి, ఇండిపెండెన్స్ డే నాటికి 100 శాతం పఠన నైపుణ్యాలు సాధించాలని

మిగతా 3లో

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

- గత ప్రభుత్వ హయాంలో పథకాల అమలులో పక్షపాతం, అవినీతి
- రాందాస్ నాయక్



3లో...



## రోడ్డు భద్రతపై అవగాహన సభ

**టీ మీడియా ,ఏప్రిల్ 17 ,కొణిజర్ల:**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల పరిధిలోని సీంగరాయపాలెం గ్రామంలో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. "అరేయ్ ఆలైవ్" పేరుతో జరిగిన ఈ కార్యక్రమం సీంగరాయపాలెం స్థానిక పాత పంచాయతీ భవనంలో సర్పంచ్ వేము నాగరాజు అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఎస్ సూరజ్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలు కుటుంబాలను దెబ్బతీస్తాయని హెచ్చరించారు. ప్రమాదాల సమయంలో క్షతగాత్రులను రక్షించేందుకు సీపీఆర్ వంటి ప్రాథమిక చికిత్సా విధానాలపై అవగాహన అవసరమన్నారు. అలాగే వాహనదారులు తమ వాహనాలకు అవసరమైన అన్ని పత్రాలు, ముఖ్యంగా బీమా పత్రాలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.గ్రామ భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల ఏర్పాటు కోసం గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సీసీ కెమెరాలు ఉంటే గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు నివారించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురభి పెద్ద రామకృష్ణ, వార్డు సభ్యుడు మట్టా వెంకటేశ్వరరావు, గ్రామస్తులు ఏలూరి శ్రీనివాస్ రావు, మిద్దె రామారావు, మట్టా బాబు, పామర్తి నాగయ్య, సురభి బజార్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, బ్లూకోట్ కానిస్టేబుల్ రామూర్తి తదితరులు పాల్గొన్నారు.



## మండల ప్రెస్ క్లబ్ నూతన కమిటీ

**-అధ్యక్షుడిగా కొర్లపాటి సురేష్, కార్యదర్శి గా మధు.**

**టీ మీడియా ,ఏప్రిల్ 17 ,కొణిజర్ల:**ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో నూతన ప్రెస్ క్లబ్ ఎన్నికలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో మండలానికి చెందిన పత్రికా ప్రతినిధులు పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అధ్యక్షుడిగా కోర్లపాటి సురేష్, కార్యదర్శిగా పగడాల మధు,ఉపాధ్యక్షుడిగా పాపగంటి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా ముత్తనబోయిన శ్రీనివాసరావు కోశాధికారిగా అనంతోజు చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా మోటపోతుల బాబూరావు, యాస నర్సింహారావు, తుమ్మలపల్లి మంగపతిరావు ఎంపికయ్యారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగినట్లు తెలిపారు. నూతన అధ్యక్షుడు కోర్లపాటి సురేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తామని మండల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ప్రెస్ క్లబ్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, కోశాధికారి అనంతోజు చంద్రశేఖర్ , కార్యదర్శి పగడాల కూడా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కలిసి పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో షేక్ నాగుల్ మీరా, కవిడ రాము, కొండబాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక లారీల సీజ్



**-ఆరుగురిపై కేసు నమోదు**

**టీ మీడియా,ఏప్రిల్17, ముదిగొండ :**ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణలోకి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక లారీలను ముదిగొండ పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ముదిగొండ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఓ. మురళీ గారికి అందిన ముందస్తు సమాచారం మేరకు, ఏఎస్ఐ ఎస్. శ్రీనివాసరావు మరియు సిబ్బంది వల్లభి వ్యవసాయ మార్కెట్ చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. లారీ యజమానులు షేక్ జనిమియా, పటాన్ యాకూబ్ పాషాతో పాటు, ఏపీ నుంచి ఇసుక సరఫరా చేస్తున్న ఆర్గనైజర్ మీరా, ఖమ్మానికి చెందిన కొనుగోలుదారు భాను సహా మొత్తం ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

**ఇన్‌స్పెక్టర్ హెచ్చరిక:**

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఇన్‌స్పెక్టర్ ఓ. మురళీ హెచ్చరించారు. అక్రమ రవాణాదారులపై అవసరమైతే పిడి యాక్ట్ కూడా నమోదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# తేజస్వి వ్యాఖ్యలను ఖండించిన బిఆర్‌టియు జిల్లా కమిటీ

**-ఎండి వై పాషా(జిల్లా అధ్యక్షుడు)**



**టి మీడియా, ఏప్రిల్ 17, ఖమ్మం :**పార్లమెంట్ వేదికగా బీజేపీ సభ్యుడు తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాష్ట్రంపై విషం చిమ్మినట్లుగా ఉందని, బి ఆర్ టి యు యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎండి వై పాషా తీవ్రంగా ఖండించారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్థాన్ ఏర్పాటుతో పోల్చడం నాలుగు కోట్ల ప్రజల మనోభావాలను తీవ్రంగా అవమానించడమేనని, ఆయన అన్నారు. ఎంతోమంది అమరుల త్యాగాల ఫలితంగా ప్రజల దీక్షలు, ఉద్యమాల ఫలితంగానే తెలంగాణ ఏర్పడిందని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం పూర్తిగా చట్టబద్ధంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, దానిని తక్కువ చేసి చూపించేలా వ్యాఖ్యలు చేయడం తగదని విమర్శించారు.ప్రజాస్వామ్యంలో ప్రతి రాష్ట్రానికి గౌరవం ఇవ్వాలని, ఇలాంటి వ్యాఖ్యలు దేశ ఐక్యతకు విఘాతం కలిగిస్తాయని అన్నారు. ప్రజా ఓట్లతో గెలిచి పార్లమెంట్లో అడుగు పెట్టి గౌరవప్రదంగా హుందాగా ఉండాల్సిన సభ్యులు ఇలాంటి వ్యాఖ్యలతో పార్లమెంట్ గౌరవాన్ని దిగజారుస్తున్నారని,తెలంగాణ రాష్ట్రం నుంచి ఎన్నికైన బీజేపీ, ఎంపీలు తెలంగాణ రాష్ట్రంపై సొంత పార్టీ నేతలే విషం చిమ్మే విధంగా మాట్లాడుతూ ఉంటే పార్లమెంట్‌లో ఉండి స్పందించకపోవడం , లేదా ఖండించకపోవడం అత్యంత విచారకరమని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ గౌరవాన్ని కాపాడే విషయంలో అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని,ఇలాంటి బాధ్యతారాహిత్య వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ గౌరవాన్ని కాపాడటంలో తెలంగాణలోని ప్రతి బిడ్డ ముందు వరుసలో ఉంటారని ఆయన అన్నారు.ఎంపీ తేజస్వి వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకొని తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.



## పెన్షనర్లు, ఉద్యోగుల ఆందోళన

**-తహసిల్దార్ కు వినతిపత్రం**

**టీ మీడియా, 17,కొణిజర్ల:**కొణిజర్ల మండల కేంద్ర పరిధిలో తెలంగాణ జిపిఓ సమితి (జేఏసీ) పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా, అన్ని మండలాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కొణిజర్ల శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.అనంతరం ఉద్యోగ సంఘాల నాయకులు తమ సమస్యలను వివరించి తహసీల్దార్ కు వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు మన్నె గురుమూర్తి, యుటిఎఫ్ నాయకులు ప్రసాద్, ట్రెసా జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్, నాయకులు రమేష్, వీరస్వామి, తెలంగాణ ఎన్‌జీవో విభాగ నాయకులు పుల్లయ్య, భాషా, కెసయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బకాయిలను సత్వరం విడుదల చేయాలి'

**-- ప్రభుత్వ ఉద్యోగుల నిరసన**

**టి మీడియా, ఏప్రిల్ 17, ఖమ్మం రూరల్:** ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను సత్వరం విడుదల చేయాలని ఖమ్మం రూరల్ మండలం ప్రభుత్వ ఉద్యోగులు తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం భోజన విరామ సమయంలో రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ పథకం, ఐకెపి, విద్యాశాఖ తదితర శాఖలకు చెందిన ఉద్యోగులు ప్లకార్డ్స్ ధరించి నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు జరిగి రెండేళ్లు గడిచినప్పటికీ నూతన పిఆర్సి కమిటీ ఏర్పాటు చేయడం లేదన్నారు. ఈ రెండేళ్ల కాలంలో అనేకమంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందినప్పటికీ వారికి రావాల్సిన ప్రోత్సాహకాలు అందడం లేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈరోజు మధ్యాహ్న భోజన సమయంలో నిరసన చేపట్టడం జరిగిందని, ప్రభుత్వం ఉద్యోగుల ఇబ్బందులను పరిగణనలకు తీసుకుని సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. జూన్ 2వ తేదీలోగా ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను పూర్తిగా విడుదల చేయాలని, లేనియెడల ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలతో పాటు పెన్‌డౌన్ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నేత గంట రవీంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.శ్రీదేవి, ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ పద్మావతి, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.






## మ్యాజిక్ బస్ఇండియా తో అవగాహన ఒప్పందం

**టి మీడియా, ఏప్రిల్ 17, ఖమ్మం:**మ్యాజిక్ బస్ఇండియా ఫౌండేషన్ హైదరాబాద్ సంస్థతో స్థానిక ఎస్ ఆర్ బి జి.ఎన్.ఆర్ కళాశాల తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరురుల్లా, శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈసంస్థవిద్యార్థులలో నైపుణ్యాభివృద్ధి కోసం వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుందని వెల్లడించారు.ఈ అవగాహన ఒప్పందం 2028 వరకు కొనసాగుతుందని తెలిపారు.ఇప్పటికే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పై వర్క్ షాప్ ను నిర్వహించారని, రానున్న విద్యా సంవత్సరాల్లో ఉపాధి కల్పన, జాబ్ మేళాలు నిర్వహించడం కోసమే ఒప్పందం చేసుకున్నామని తెలిపారు.కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి ఏ.ప్రవీణ్, కళాశాల ప్లేస్ మెంట్ సెల్ కోఆర్డినేటర్ డా.చందాసుధాకర్,టీ.ఎస్.కేసి కోఆర్డినేటర్ ఎం.మాధవి,ఐ.క్యూ.ఏ.సి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద, మెంటార్ యాలాద్రి పాల్గొన్నారు

## మల్లికార్జున ఖర్గేపై అనుచిత వ్యాఖ్యలు

**- అస్సాం సీఎంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**

**టీ మీడియా, ఏప్రిల్ 17, ముదిగొండ:** ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మాల మహానాడు నాయకులు శుక్రవారం ముదిగొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జాతీయ మాల మహానాడు ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఉండేటి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, ముదిగొండ మండల అధ్యక్షులు తోటమళ్ళ భరత్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత ఏప్రిల్ 7వ తేదీన మల్లికార్జున ఖర్గేను చంపేస్తామంటూ అస్సాం సీఎం బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం ప్రజాస్వామ్యానికే విఘాతమని మండిపడ్డారు. ఒక ఉన్నత పదవిలో ఉండి దళిత నాయకుడిపై ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమని, ఆయనపై వెంటనే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ముదిగొండ ఎస్.హెచ్.ఓ ఓ. మురళిని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షులు కామాల రామనాథం, జిల్లా నాయకులు, మండల స్థాయి నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



